# నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 5 మార్చి 2024 | NIZAMABAD


“ కండ్లముందే ఎండుతున్నాయి..



ఎంతో కష్టపడి వరి సాగు చేసిన. నిజాంసాగర్ కాలువ నీరు పంటకు అందకపోవడంతో కండ్లమందే పంట ఎండిపోతుంది. నీరు లేక భూమి పర్రెలు చాచింది. ఉన్న ఒక బోరు నుంచి సరిగా నీరు రావడం లేదు. నల్లా వచ్చినట్లు వస్తున్నది. పంటలకు బోరు నీరు సరిపోకపోవడంతో వరిపైరు ఎండిపోయే దశలో ఉన్నది. ప్రస్తుతం గింజకట్టే దశలో ఉన్నది. ఇదే సమయంలో నీరు లేకపోవడంతో పంట నష్టం జరిగే ప్రమాదం ఉన్నది. అధికారులు స్పందించి కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగర్ నీరు అందించేలా చర్యలు తీసుకొని పంటలను కాపాడాలి.

**- రాంబాబు, రైతు, జైనాపూర్ శివారు, కోటగిరి**



నిజాంసాగర్ జలాశయం

# ఎండుతున్న పైరు..
# రైతన్న కన్నీరు

- చివరి ఆయకట్టుకు అందని సాగర్ నీరు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ఎండుతున్న యాసంగి పంటలు
- పట్టించుకోని అధికారులు



జైనాపూర్‌లో గింజకట్టే దశలో ఎండుతున్న పైరు

కోటగిరి, మార్చి 4: జిల్లాలో రోజురోజుకూ భూగర్భ జలాలు పడిపోతున్నాయి. ఎక్కడ చూసినా రైతులు సాగు చేసిన పంటలు కండ్ల ముందే ఎండిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కోటగిరి మండల కేంద్ర సమీపంలోని జైనాపూర్ శివారులో భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు నీటిపై ఆధారపడిన పంటలకు నీరు అందడం లేదు. కొందరు రైతులు తమ పొలాలను కాపాడుకునేందుకు ఇతర రైతుల బోరు నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి కోటగిరి మండలంలోని వివిధ గ్రామాల్లో సైతం బోరుబావులపైన ఆధారపడి సాగు చేసిన పంటలు ఎండిపోయే దశలో ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### బోరు నీరు సరిపోవడం లేదు..

కోటగిరికి చెందిన రాంబాబు అనే రైతు జైనాపూర్ శివారులో బోరుబావిపై ఆధారపడి ఆరు ఎకరాల్లో వరి సాగు చేశాడు. ఇటీవల ఉన్నఫళంగా భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు నీళ్లు తగ్గిపోయాయి. ఆరు ఎకరాలకు నీరు లేక పంట ఎండిపోతున్నది. భూమి పగుళ్లు ఏర్పడ్డాయి. ఇదే శివారులో పత్తి సాయిలు అనే రైతు 14ఎకరాలు వరి సాగు చేస్తున్నాడు. బోరు నీరు సరిపోక, చివరి ఆయకట్టుకు నిజాంసాగర్ కాలువ నీరు అందక పంట ఎండిపోయే దశలో ఉన్నదని ఆందోళన చెందుతున్నాడు.

**గింజకడుతున్న** వరిపైరు కండ్ల ముందే ఎండిపోతున్నది. బోరుబావి నుంచి చుక్క నీరు రావడం లేదు. నిజాంసాగర్ కాలువ ద్వారానైనా చివరి తడి అందించి పంటను కాపాడుకుందామంటే చివరి ఆయకట్టు వరకు బొట్టు నీరు రావడం లేదు. ఎండుతున్న పైరును చూస్తున్న రైతన్న కంట కన్నీరే వస్తున్నది. ఇదీ నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల శివారులోని పలువురు రైతుల పరిస్థితి.



### పంటలను కాపాడాలి..

ప్రస్తుతం వరి పంట గింజ కట్టే దశలో ఉన్నది. మరో తడి అందితే పంట కోతకు వస్తున్నది. కానీ చివరి ఆయకట్టుకు సాగు నీరు అందక పంట ఎండిపోతున్నది. భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు నీరు సరిపోవడం లేదు. రెండు రోజుల్లో నిజాంసాగర్ నీటిని అందిస్తే పంటలను కాపాడుకోవచ్చు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి నీటిని అందించి పంటలను కాపాడేలా చర్యలు తీసుకోవాలి.

**-పత్తి సాయిలు, రైతు, జైనాపూర్ శివారు, కోటగిరి**

కుళాయిలా పోస్తున్న బోరుమోటారు



## నిజాంసాగర్ నీటి విడుదల నిలిపివేత

నిజాంసాగర్, మార్చి 4: నిజాంసాగర్ ఆయకట్టుకు యాసంగి సాగు కోసం కొనసాగిన నీటి విడుదలను ఆదివారం రాత్రి నిలిపివేసినట్లు నీటి పారుదల శాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. ఆయకట్టు కింద సాగు చేస్తున్న లక్షా 25వేల ఎకరాల పంటల కోసం నవంబర్ నెలలో ప్రారంభించిన నీటి విడుదల ఇప్పటి వరకు ఐదు విడుతల్లో పూర్తయ్యిందని అన్నారు. ఐదు విడుతల్లో 7.60 టీఎంసీల నీటిని విడుదల చేశామని తెలిపారు. ఆయకట్టు పంటలు గట్టెక్కేందుకు మొత్తం 11టీఎంసీల నీటిని ఏడు విడుతల్లో విడుదల చేయనున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో 1405.00 అడుగులు (17.80 టీఎంసీలు)కు గాను 1396.36 అడుగులు (7.89 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నదని, పది రోజుల అనంతరం రైతుల అవసరాలకు అనుగుణంగా నీటి విడుదలను ప్రారంభిస్తామని తెలిపారు

పొలంలో నిరసన తెలుపుతున్న ఫత్తేపూర్ రైతులు, పక్కన ఏఈవో అపర్ణ



## ఎండుతున్న పంటల సాక్షిగా రైతుల నిరసన

“ బోధన్ రూరల్, మార్చి 4: చివరి ఆయకట్టు వరకు నిజాంసాగర్ నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సాలూర మండలంలోని ఫత్తేపూర్ గ్రామ రైతులు ఎండిపోతున్న పంటల సాక్షిగా సోమవారం నిరసన తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, చివరి ఆయకట్టు వరకు ఒక చుక్క నీరు రాలేదన్నారు. సీఎం సార్ తమ పంటలకు నీళ్లు అందించాలని వేడుకున్నారు. స్థానిక ఏఈవో అపర్ణ ఎండుతున్న పంటలను పరిశీలించి, ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

### వారం రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా..

| తేదీ | గరిష్ట | కనిష్ట |
|---|---|---|
| 28-02-2024 | 33.0 | 22.3 |
| 29-02-2024 | 33.6 | 21.3 |
| 01-03-2024 | 36.2 | 21.6 |
| 02-03-2024 | 36.9 | 21.9 |
| 03-03-2024 | 36.9 | 24.5 |
| 04- 03-2024 | 38.0 | 24.9 |

## ప్రజాపాలన సేవా కేంద్రాలు ప్రారంభం

**ఉమ్మడి నిజామాబాద్** జిల్లాలోని మండల కేంద్రాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు సోమవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసే ఆరు గ్యారెంటీల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. బిచ్కుంద ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

– బిచ్కుంద, మార్చి 4



## చింతకాయల చోరీ
### ముగ్గురిపై కేసు నమోదు

శక్కర్‌నగర్, మార్చి 4: బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని ఎన్ఎస్ఎఫ్ ఫ్యాక్టరీ మైదానంలో సోమవారం ముగ్గురు వ్యక్తులు చింతచెట్ల నుంచి చింతకాయల చోరీకి యత్నించారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి వారిని అడ్డుకోగా, అతనిపై దాడికి యత్నించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బి.వీరయ్య తెలిపారు.

## ఇంటర్‌లో ఇద్దరు డిబార్

ఖలీల్‌వాడి/శక్కర్‌నగర్/ కామారెడ్డి, మార్చి 4: ఇంటర్ ఫస్టియర్ పరీక్షల్లో జిల్లాలోని వేర్వేరు సెంటర్లలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ సోమవారం ఇద్దరు విద్యార్థులు పట్టుబడ్డారు. బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకరు, విజేత జూనియర్ కళాశాలలో మరో విద్యార్థి కాపీయింగ్ చేస్తుండగా ఫ్లయిం గ్ స్క్వాడ్ పట్టుకొని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు డీఐఈవో రఘురాజ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 809 మంది విద్యార్థులు గైర్హాజరుకాగా, 96శాతం హాజరయ్యారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ, స్క్వాడ్‌ల ఆధ్వర్యంలో 47పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. నిజామాబాద్ నగరంలోని కాకతీయ, సీఎస్ఐ కళాశాలల్లో ఏర్పాటు చేసిన సెంటర్లను జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. కామారెడ్డి జిల్లాలో 9813 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు.

## అప్పు ఇవ్వలేదని.. కత్తితో దాడి

వినాయక్‌నగర్, మార్చి 4: అప్పు ఇవ్వబోనని చెప్పినందుకు ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన నిజామాబాద్ నగరంలో సోమవారం చోటు చేసుకున్నది. మూడోటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన ఖండోభా అనే వ్యక్తి నగరంలోని రైల్వేలైన్ ప్రాంతంలో కూలీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. తోటి కూలీ అయిన దస్తగిరి సోమవారం మధ్యాహ్నం ఖండోభా దగ్గరికి వచ్చి మద్యం తాగేందుకు డబ్బులు బాకీ ఇవ్వమని అడిగాడు. తన వద్ద డబ్బులు లేవని ఖండోభా చెప్పగా, ఆగ్రహించిన దస్తగిరి తన వద్ద ఉన్న కత్తితో ఖండోభా కడుపులో పొడిచాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. ఖండోభా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంత్యక్రియలకు వెళ్తూ.. అనంతలోకాలకు

### రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి
### మృతుడు సదాశివనగర్ విండో డైరెక్టర్



ఏనుగు ప్రతిభ, జనార్దన్ రెడ్డి దంపతులు(ఫైల్)

సదాశివనగర్, మార్చి 4: అంత్యక్రియలకు వెళ్తున్న దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో చోటు చేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. సదాశివనగర్‌కు చెందిన విండో డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకుడు జనార్దన్‌రెడ్డి (49), ఏనుగు ప్రతిభ (42) దంపతుల సమీప బంధువు సోమవారం పద్మాజీవాడిలో మృతి చెందడంతో అంత్యక్రియలకు హాజరయ్యేందుకు స్కూటీపై ఉదయం బయల్దేరారు. పద్మాజీవాడి గ్రామ శివారులో జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతుండడంతో సర్వీస్ రోడ్డు వెంట వెళ్లి మలుపు తిరుగుతున్న సమయంలో నిజామాబాద్ నుంచి కామారెడ్డి వెళ్తున్న గుర్తు తెలియని వాహనం స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న ప్రతిభ, జనార్దన్‌ల శరీరాలు నుజ్జునుజ్జు అయ్యాయి. ప్రతిభ అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన జనార్దన్‌ను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతూ జనార్దన్ కూడా మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సదాశివనగర్ పోలీసులు తెలిపారు. మృతిచెందిన దంపతులకు ఇద్దరు పిల్లలు ఉండగా ఒకరు గతంలో మృతి చెందారు. మరో కుమారుడు హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. విండో డైరెక్టర్ ఏనుగు జనార్దన్ రెడ్డి దంపతులు మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, విండో చైర్మన్ కమలాకర్ రావు, డైరెక్టర్లతోపాటు బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో దవాఖానకు తరలివచ్చారు.

# భానుడి ప్రతాపం.. ప్రారంభం

చున్నీలతో ఎండవేడిమి నుంచి రక్షణగా..





### క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
### గరిష్ఠంగా 38 డిగ్రీలు నమోదు
### మధ్యాహ్న వేళలో నిర్మానుష్యంగా రోడ్లు

ఖలీల్‌వాడి, మార్చి 4: వాతావరణ మార్పులు, భూతాపం కారణంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మార్చి ప్రారంభం నుంచే పగటి పూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఉమ్మడి నిజామాబాద్‌పై భానుడి ప్రతాపం క్రమంగా పెరుగుతున్నది. వేడి, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఇంకెంత తీవ్రంగా ఉంటుందోననే ఆందోళన వ్యక్తమవుతున్నది. ఎండ ఎక్కువగా ఉండడంతో ఉదయం 9 గంటల తర్వాత బయటికి వెళ్లేందుకు జనం భయపడుతున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, కూలీలు, విద్యార్థులు అందరూ అవస్థలు పడుతున్నారు. పగలు చల్లదనం కోసం తహతహలాడిన వారు రాత్రయిందంటే ఉక్కపోతతో తల్లడిల్లుతున్నారు. మధ్యాహ్నం 12గంటల నుంచే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. గతంలో కన్నా ఈసారి ఎండలు ఎక్కువగానే ఉంటాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గతేడాది అత్యధికంగా మే మాసంలో 46.6 డిగ్రీలుగా రికార్డు అయింది. ఈ సీజన్‌లో వర్షాలు అంతంత మాత్రంగానే పడడంతో నీళ్లులేక వ్యవసాయ భూములు ఎండిపోతున్నాయి. పిల్లలు, గర్భిణులకు ఎండలు మంచివి కావని, రక్షణ చర్యలు తీసుకోకుండా బయటికి రావొద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఇప్పటి నుంచే ఎయిర్ కూలర్, రంజన్లను కొనుగోలు చేస్తున్నారు.



నిజామాబాద్‌లో ఎండవేడిమి తట్టుకోలేక చున్నీ కప్పుకున్న యువతులు

## తోటి విద్యార్థిపై సహచరుల దాడి

### ఊపిరాడక విద్యార్థి మృతి
### ప్రభుత్వ హాస్టల్‌లో దారుణం
### ఏడుగురు నిందితుల గుర్తింపు



పోలీస్‌స్టేషన్ ఎదుట రోదిస్తున్న వెంకట్ తల్లి, విద్యార్థుల దాడిలో మృతిచెందిన వెంకట్(ఫైల్) ఇన్‌సెట్‌లో..

శక్కర్‌నగర్, మార్చి 4: బోధన్ పట్టణంలోని బీసీ కళాశాల బాలుర వసతిగృహంలో దారుణం జరిగింది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఏడుగురు విద్యార్థుల దాడిలో హరియాలి వెంకట్ (23) అనే విద్యార్థి మృతిచెందాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న వెంకట్, వసతిగృహంలోని విద్యార్థులకు నాయకుడిగా ప్రత్యేక తరగతులను పర్యవేక్షించేవాడు. పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో ఇంటర్ విద్యార్థులను చదువుకోవాల్సిందిగా వారిపై కొంత ఒత్తిడి చేయడంతో సదరు విద్యార్థులు క్లాసుల అనంతరం ఆదివారం అర్ధరాత్రి సమయంలో వెంకట్ నిద్రిస్తున్న గదికి వెళ్లి ఆయనపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఊపిరాడక వెంకట్ మృతి చెందినట్లు గుర్తించిన నిందితులు పరారయ్యే క్రమంలో ఇతర విద్యార్థులు వారిని పట్టుకున్నారు. ఈ విషయమై వార్డెన్ స్వామికి సమాచారం అందించడంతో వెంకట్‌ను దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తోటి విద్యార్థుల సమాచారంతో వెంకట్ తల్లి దండ్రులు, కుటుంబీకులు, బంధువులు అర్ధరాత్రి తరలివచ్చి ఆందోళన చేపట్టారు. సోమవారం ఉద యం వరకు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన కొనసాగింది. తమ కుమారుడిని కావాలనే హతమార్చారని వెంకట్ కుటుంబీకులు ఆరోపించారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు చెప్పడంతో మృతుడి బంధువులు ఆందోళన విరమించారు. వెంకట్ తండ్రి హరియాల జగ్గు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

**ఏడుగురు విద్యార్థుల గుర్తింపు..**

వెంకట్‌పై దాడి చేసి, అతని చావుకు కారణమైన ఏడుగురు విద్యార్థులను పోలీసులు గుర్తించారు. ముందుగా ఆరుగురు దాడికి పాల్పడినట్లు గుర్తించినా, పోలీసులు విచారణలో మరో విద్యార్థిని కూడా గుర్తించారు. ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఓ విద్యార్థి మాస్ కాపీయింగ్ కోసం చిట్టీలను తయారు చేస్తుండగా గుర్తించిన వెంకట్ సదరు విద్యార్థిని బెదిరించాడు. దీంతో ఆ విద్యార్థి అదే వసతిగృహంలో ఉంటున్న వరుసకు సోదరుడైన దిలీప్‌కు ఈ విషయాన్ని వివరించాడు. ఇంటర్ సెకండియర్ విద్యార్థులైన దిలీప్, కృష్ణ, లక్ష్మణ్, డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు పరమేశ్, నితిన్, శివకుమార్‌తోపాటు ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి కలిసి వెంకట్‌పై దాడికి పాల్పడడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ బి.వీరయ్య తెలిపారు.